జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 29-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 658 పేజీలు: 4 వెల : రూ.7


## 30న జాబ్ మేళా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు నగరంలోని బలగ రోడ్, హాస్పిటల్ జంక్షన్ వద్ద గల ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ మేళాలో పేటీఎం సంస్థ 95 ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ (పదో తరగతి అర్హత, వేతనం రూ.17,500), టీమ్ లీజ్ ఎస్‌బీఐ కార్డ్స్ సంస్థ 150 బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (ఇంటర్ అర్హత, వేతనం రూ.18,000 - 25,000) పోస్టులను భర్తీ చేయనున్నాయి. 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలని, అలాగే తమ వివరాలను www.ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

## మే 3 నీట్ పరీక్ష

* కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు * జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** మే 3న జరగనున్న నీట్ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రధాన కేంద్రాల్లో మొత్తం 1,951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఆర్జీయూకేటీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పరీక్షా నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించారు. అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తూ, పరిసర ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయాలని నిర్ణయించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులతో పాటు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రతి కేంద్రం వద్ద అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచనున్నారు. పరీక్షా సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, నిబంధనలను పాటించాలని అధికారులకి స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై మే 1న 'డెడికేటెడ్ కమిషన్' బహిరంగ విచారణ


**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ప్రభుత్వం నియమించిన 'డెడికేటెడ్ కమిషన్' మే 1వ తేదీన జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 'ట్రిపుల్ టెస్ట్' నిబంధనలను అనుసరిస్తూ బీసీల వెనుకబాటుతనంపై క్షేత్రస్థాయిలో అనుభవా ధారిత పరిశోధన నిర్వహించనుంది. ఇందులో భాగంగా మే 1న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుల సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఆసక్తి గల వ్యక్తుల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరిస్తారని, అనంతరం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి కమిషన్ బృందం క్షేత్ర పర్యటన చేపడుతుందని ఆయన వివరించారు. జిల్లాలోని బీసీ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ తమ విన్నపాలను వ్రాతపూర్వకముగా కమిషన్‌కు అందజేయాలని కలెక్టర్ సూచించారు. వినతిపత్రాలు కేవలం స్థానిక సంస్థల్లో బీసీల స్థితిగతులు, రిజర్వేషన్ల శాతానికి సంబంధించిన అంశాలకే పరిమితమై ఉండాలని, ప్రతిపాదనలతో పాటు తగిన సాక్ష్యాధారాలు లేదా పత్రాల నకళ్లను జతచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో కలెక్టరేట్‌కు చేరుకుని కమిషన్ ప్రతినిధులను కలిసి తమ సామాజిక వర్గాల వెనుకబాటుతనంపై స్పష్టమైన గణాంకాలు, వాస్తవ వివరాలను సమర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విజ్ఞప్తి చేశారు.

## గిరిజన దంపతుల హత్య

**కొత్తూరు, ఏప్రిల్ 28 (వార్త):** చిల్లంగి పెట్టారనే నెపంతో భార్యాభర్తలను ఓ వ్యక్తి హత్య చేసిన ఘటన కొత్తూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ చినరాజపురం గ్రామానికి చెందిన చెందిన సవర ఇల్లంగో (55), జ్యోతి (50)లను అదే గ్రామానికి చెందిన సవర తోటయ్య కత్తితో పొడిచి హత్య చేశాడు. ఇల్లంగో చిల్లంగి చేయడం వల్ల తన చిన్నారి పలుమార్లు అనారోగ్యానికి గురైందని అనుమానంతోనే హత్యకు పాల్పడ్డాడు. అదే సమయంలో భార్య జ్యోతి అడ్డుకోవడంతో ఆమెను కూడా చంపేశాడు. ఈ విషయాన్ని మృతుల కుమారుడు కొత్తూరు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇదేం.. కలెక్షన్!






* డైలీ మార్కెట్‌కు ఖరారు కాని వేలంపాట * పంచాయతీ సిబ్బందే కలెక్షన్ చేస్తున్న వైనం * డిపార్టుమెంట్ పేరిట నకిలీ రసీదులు * ఈ కలెక్షన్ అమౌంట్ ఎవరి జేబుల్లోకి * సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు * పరిశీలించి పొరపాట్లు సరిచేస్తామన్న సిబ్బంది

**సోంపేట, ఏప్రిల్ 28 (వార్త):** సోంపేట మేజర్ పంచాయతీలో డైలీ మార్కెట్ కార్ట్ అండ్ బస్టాండ్‌లకు వేలంపాటలు ఖరారు కాకపోవడంతో చివరకు డిపార్టెంట్ కలెక్షన్ చేయాలని పంచాయతీ నిర్ణయించుకుంది. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులను పెట్టి కొద్దిరోజులుగా కలెక్షన్ కొనసాగిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా కలెక్షన్ చేసే విధానం పలు అనుమానాలకు తావిస్తోంది. కలెక్షన్‌కు సంబంధించి సదరు వ్యక్తులకు అందించిన రసీదు పుస్తకాలపై ప్రతి రసీదుపైన సీరియల్ నెంబర్ గాని తేదీ గాని లేకుండానే రసీదులు జారీ చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అవకతవకలకు అవకాశం లేకుండా పగడ్బందీగా రసీదులను అందించి తద్వారా వచ్చే ఆయా మొత్తాలను ప్రతిరోజు సాయంత్రం పంచాయతీ కార్యాలయానికి జమ చేయాల్సి ఉంది. అయితే రసీదులపై తిరకాసు వల్ల అసలు ఎంత వస్తుందో కార్యాలయానికి ఎంత చెందుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. డిపార్టెంట్ కలెక్షన్ ద్వారా అవకతవకలకు ఆస్కారం అధికంగా ఉంటుందని బహిరంగంగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వేలం పాటలో డిపాజిట్ దారులు సిండికేట్‌గా మారి నాలుగు సార్లు పాటలు నిర్వహించిన అప్సెట్ ధరలు అధికంగా ఉన్నాయంటూ ఆడకుండా దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డిపార్టెంట్ కలెక్షన్ అధికారులు ప్రారంభించినప్పటికీ ఇందులో సరైన పారదర్శకత లేదంటూ పబ్లిక్ నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. డైలీ మార్కెట్ అప్సెట్ ధర 16 లక్షల పైగా నిర్ణయించడం, అలాగే కార్ అండ్ బస్టాండ్ అప్సెట్ ధరను 13 లక్షల పైగా నిర్ణయించడంతో సిండికేట్ దారులు ఈ ఏడాది కూడా పాటలకు గండి కొట్టిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా అప్పటికి కలెక్షన్ రసీదుల విషయంలో జరుగుతున్న అవకతవకలపై అనుమానాలను నివృత్తి చేస్తూ అక్రమాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటూ స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై జాతీయవార్త ప్రతినిధి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పట్నాయక్ వద్ద ప్రస్తావించగా పొరపాటున పాతరసీదులు అందజేసి ఉంటారని పేర్కొనడం గమనార్హం. పరిశీలించి పొరపాట్లు సరి చేస్తామని అన్నారు.

## వైభవం.. సిరిమానోత్సవం

* తరలివచ్చిన భక్తజనం * కిటకిటలాడిన అరసవల్లి * పోలీసుల పటిష్ట బందోబస్తు * ప్రశాంతంగా సాగిన సిరిమానోత్సవం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** అరసవల్లి అసిరితల్లి సిరిమానోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. అరసవల్లి మాడవీధిలోని దుర్గమ్మ గుడి వద్ద ప్రారంభమైన ఈ ఉత్సవం, వెలమ వీధి, నక్కవీధి, నీలం గుడి, రామ మందిరం, కాపు వీధి, బ్రాహ్మణ బొంపాడ, ఆదిత్యాలయం ప్రధాన మార్గం మీదుగా కొనసాగింది. శ్రీ శయన వీధి, పెద్ద తోట, అరసవిల్లి ప్రధానదారి గుండా అసిరితల్లి గుడివరకు ముందుకుసాగింది. పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిరిమాను కదిలింది. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో భారీ స్థాయిలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి సిరిమానోత్సవాన్ని తిలకించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాల పార్కింగ్‌ను సక్రమంగా నిర్వహించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కేటాయించిన ప్రదేశాల్లో పకడ్బందీగా విధులు నిర్వర్తిస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టారు.



## జిల్లాలో పెట్రోల్, డీజల్ కొరత లేదు

* అసత్య ప్రచారాలు చేయొద్దు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * పలు పెట్రోల్ బంకుల తనిఖీ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** జిల్లాలో పెట్రోల్, డీజిల్ లకు కొరత లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలో గల బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ బంక్, రైతు బజార్ పక్కన గల ఇండియన్ ఆయిల్ బంక్, డే అండ్ నైట్ దగ్గర గల హెచ్ పీ బంకులను ఆయన సందర్శించారు. ఆయిల్ అయిపోక ముందే ఇండెంటెడ్ పెట్టినందున వలన ఆయిల్ వెంటనే వచ్చిందని, బంకు యాజమానులను ఆయన అభినందించారు. ఆయిల్ స్టోరేజీపై ఆరా తీశారు. జిల్లాలో 5 పెట్రోల్ బంకుల్లో ఆయిల్ లేకపోతే విశాఖపట్నం నుండి వెంటనే వచ్చిందన్నారు. అమ్ముకునే వారికి పెద్ద మొత్తంలో ఆయిల్ వేయవద్దని ఆదేశించారు. రైతు బజార్ వద్ద గల పెట్రోల్ బంకులో 8 వేల లీటర్లు అందుబాటులో ఉందన్నారు. ఆయిల్ ఉంటుండగానే పెట్రోల్ కంపెనీకి ఇండెంటెడ్ పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరుగుతున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ లో ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెట్రోల్ బంకులు వద్ద ఒక విఆర్ఓ, పోలీసు ఉంటారన్నారు. కొన్ని బంకులకు ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించినట్లు వివరించారు. పెట్రోల్, డీజిల్ లేదని ఎవరూ అసత్య ప్రచారం చేయొద్దన్నారు. మత్స్యకారులు, రైతులకు సంబంధించి సంబంధిత సచివాలయాల అసిస్టెంట్లు కూపన్లు జారీ చేస్తారని, వారు అందుబాటులో లేని యెడల బంకులు వద్ద ఉన్న విఆర్ఓలు కూపన్లు జారీ చేస్తారన్నారు. విఆర్ఓ, సచివాలయాల సంబంధిత అసిస్టెంట్లు కో ఆర్డినేట్ చేసుకోవాలన్నారు. పెట్రోల్ డీజిల్ లకు ఏ విధమైన కొరత లేదన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియ, తదితరులు పాల్గొన్నారు.







# ఏపీలో మద్యం ఫుల్.. పెట్రోల్, డీజిల్ నిల్!

* సామాన్యులు బాగుపడాలంటే సైకిల్ పోవాలి * రాష్ట్రంలో అసమర్ధ ప్రభుత్వం, రాక్షస పాలన * వైసీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు * హరిపురం పెట్రోల్ బంక్ వద్ద వైసీపీ నేతల నిరసన

**మందస, ఏప్రిల్ 28(వార్త):** ఆంధ్రప్రదేశ్ లో మద్యం ఫుల్‌గా లభ్యమవుతోందని, పెట్రోల్, డీజల్ మాత్రం దొరకడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. మంగళవారం పలాస నియోజకవర్గం మందస మండలంలోని హరిపురం జాతీయ రహదారి ప్రక్కన ఉన్న పెట్రోల్ బంకు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సామాన్యులు బాగుపడాలంటే సైకిల్ పోవాలన్నారు. అసమర్ధ చంద్రబాబు కూటమి పాలనలో గత 4,5 రోజుల నుండి ఆంధ్రప్రదేశ్‌లో డీజల్, పెట్రోల్ కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పతున్నారన్నారు. ఇంధనం కొరత ఏర్పడుతుందని ప్రభుత్వం దగ్గర ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ఇంధనం కొరత నివారణకు ఎటువంటి ఏర్పాట్లు చేయకుండా కాలయాపన చేశారన్నారు. ప్రభుత్వం డీజల్, పెట్రోల్ కొరత లేదని చెబుతుందని, కానీ రాష్ట్రవ్యాప్తంగా చాలా బంకులో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయన్నారు. డీజల్, పెట్రోల్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజలకు అందుబాటులో ఉండవలసిన పాలకులు టూర్లలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను గమనించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరువున ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులు వద్ద వైస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు ఎన్ని ధనుంజయ, పలాస నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర పార్టీ నాయకులు, జిల్లా పార్టీ నాయకులు, మండల, పట్టణ పార్టీ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 28 (వార్త):** ఆంధ్ర-ఒడిశా సరిహద్దు సవరదేవిపేట (పేటూరు) సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. లొద్దపుట్టి గ్రామానికి చెందిన ఉప్పాడ కామేష్(42)ను విశాఖపట్నం వైపు నుంచి ఒడిశా వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టి, ఆయనపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై.. ఘటనాస్థలం నుంచి పరారవుతున్న కంటైనర్ లారీని వెంబడించి పట్టుకున్నారు. అప్పటికే వేగంగా తప్పించుకుపోయేందుకు ప్రయత్నిస్తున్న లారీ లొద్దపుట్టి వద్ద మరో కారును ఢీకొనే ప్రయత్నం చేసింది. ఈ సమాచారం అందుకున్న పోలీ సులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు కామేష్‌కు భార్య నాగమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబపెద్ద మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ట్రీగార్డుల ఏర్పాటు వాయిదా

**మందస, ఏప్రిల్ 28(వార్త):** మందసలోని బజారు జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం 4గంటలకు గో గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో జరగాల్సిన మొక్కలకు ఇనుప రక్షణ గార్డుల ఏర్పాటు కార్యక్రమం వాయిదా పడిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

## గోవధను పూర్తిగా నిషేధించాలి



**మందస, ఏప్రిల్ 28(వార్త):** గోవధను పూర్తిగా నిషేధించాలని ఎస్ఎస్ఎఫ్, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. గోసంరక్షణ విధిగా చేయాలని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు మాట్లాడుతూ గతంలో గోసంరక్షణ నిమిత్తం ఎన్నో సేవలు అందించారన్నారు. భారతదేశం అంతటా గోసంరక్షణ నిమిత్తం గోవధను పూర్తిగా నిషేధించాలని, దేశవ్యాప్తంగా గోవుల సేవలకు ఏకరీతి చట్టాలను అమలు చేయాలన్నారు. ఒక గోసంరక్షణ సంస్థను స్థాపించాలని, కేంద్ర గోసంరక్షణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, గోసంరక్షణ విధానాన్ని నిర్ధారించడానికి ఒక చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జోనల్ మాజీ ఇన్‌చార్జి రౌతు చిరంజీవిరావు, ఇప్పిలి వెంకటరావు, తలగన జయరాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పెట్రోల్ కొరత లేదు

### - ఏపీటీసీపీ చైర్మన్ వజ్జ బాబురావు



**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మంగళవారం ఆయన పలాస నుంచి అమరావతి వెళ్తూ.. పత్తిపాడు వద్ద పెట్రోల్ బంక్ సిబ్బందితో మాట్లాడారు. ఎటువంటి కొరత లేదని, ప్రజలు అపోహలు పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. కొంతమంది చిడతల బ్యాచ్ వారి ఉనికి కోసం ఏదో జరిగిపోయిందని, చిడతలు పట్టుకుని రోడ్ మీద వాళ్ల వెకిలి చేష్టలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ చేష్టలు చూసి ప్రజలు నవ్వుతున్నారని మండిపడ్డారు. ఈయన వెంట టీడీపీ నాయకులు కొరికన శంకరరావు, సాసుమాను మౌళి తదితరులు ఉన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగపరుచుకోండి



**మెళియాపుట్టి, ఏప్రిల్ 28 (వార్త):** మెళియాపుట్టిలోని శాఖా గ్రంథాలయంలో సుమారు 40 రోజులు పాటు నిర్వహించున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని చిన్నపిల్లలు, విద్యార్థులు, పోటీ పరీక్షలు వెళ్లే యువత, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా కోరారు. జూన్ 6వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మెళియాపుట్టి శాఖా గ్రంథాలయ అధికారిణి అనురాధ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో అప్పన్న, మండల విద్యాశాఖ అధికారులు దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభం తదితరులు విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రామాయణ, మహాభారత ఇతిహాస గ్రంథాలతోపాటు చిన్న పిల్లలకు విద్యార్థులకు పోటీ పరీక్షలకు వెళ్లే యువతకు కావాల్సిన పుస్తకాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకుని ప్రయోజనం పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దకర అనిల్‌కుమార్, మహిళా పోలీస్ సనపల భారతి, మురళీమోహన్ పాత్రో, రీడర్స్ ప్రియాంక, ధనుంజయ్, వెంకీ, సహాయ కురాలు హేమలత, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 28(వార్త):** పన్నెండోవ వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వీ అనంతాచార్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యని పరిష్కరించి, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. 12 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణించా లని, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను తెలుగు, హిందీస్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఏపీటీఎఫ్ ఇచ్ఛాపురం మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం డీఏ బకాయిల చెల్లింపు సమస్యపై ఉపఖజానా కార్యాలయాధికారిణి కలిసి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణాచార్యులు, జి.ఉమాశంకర్, కె.సత్య మయ్య, అశోక్, నీలకంఠం, కె.మధు, సీహెచ్ వెంకటరమణ, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు హత్యపై ఆగ్రహం

### - శ్రీకాకుళంలో కొవ్వొత్తులతో నిరసన

### - రక్షణ చట్టం కోసం ఏకగళం



**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి దారుణ హత్య రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ ఘటనను ఖండిస్తూ శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టులు ఏడు రోడ్ల కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. “జర్నలిస్టుపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి” అంటూ నినాదాలు చేస్తూ హత్యకు బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు, సంఘ నాయకులు మాట్లాడారు. నల్లి ధర్మారావు మాట్లాడుతూ, “జర్నలిస్టు హత్య అనేది హేయమైన చర్య. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, సమాజానికి సమాచారం అందించే వ్యవస్థపై దాడి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరం” అని పేర్కొన్నారు. శాసపు జోగినాయుడు మాట్లాడుతూ, “రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు ఆందోళనకరంగా మారాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి” అని అన్నారు. డోల అప్పన్న మాట్లాడుతూ, “మృతుడైన జర్నలిస్టు కుటుంబానికి కనీసం కోటి రూపాయల పరిహారం ప్రభుత్వం అందించాలి. కుటుంబానికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత” అని డిమాండ్ చేశారు. తిత్తి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, “జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. అప్పుడే మీడియా స్వేచ్ఛకు భరోసా ఉంటుంది” అని అన్నారు. పేడాడ హంసుందర్ మాట్లాడుతూ, “ఆంధ్రజ్యోతి జర్నలిస్టు హత్య అన్నది ప్రతి జర్నలిస్టుని కలిచివేసింది. ఇది ఒక్క సంఘటన కాదు, వ్యవస్థలో పెరుగుతున్న ప్రమాదానికి సంకేతం” అని వ్యాఖ్యానించారు. ఒంపూరు రమేష్ మాట్లాడుతూ, “జర్నలిస్టులపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం చూపకూడదు. భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత” అని అన్నారు. సూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, “జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలి. వారి భద్రత, సంక్షేమం కోసం కృషి చేయాలి” అని సూచించారు. కార్యక్రమంలో డోల శంకర్, బాలు, మొదలవలస వాసు, ఆకులు మాధవ్, గుండబాల మోహన్, అలీ బేగ్, ఆర్వి పట్నాయక్, బెహరా షణ్ముఖ, అద్దంకి సురేష్, లక్ష్మణ్, గణపతి, బాలామణి, నందూరి రాధా, రవి, రాజేష్, బద్రి, సింగూరు శీను, బొడ్డ కృష్ణ, సాయి, బమ్మిడి వేణు, ప్రసాద్, గోపి, రమేష్, శ్రీను, చిన్నారావు, పోగోటి రాజు, ప్రవీణ్ జగదీష్, రాము, బొడ్డేపల్లి రాజేష్, అల్లు భాస్కరరావు, జామి శ్రీనివాసరావు, రౌత్ సూర్యనారాయణ, ప్రభాస్ సూరి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమం జర్నలిస్టుల ఐక్యతను, భద్రతపై ఉన్న ఆందోళనను స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు ఏకగళంగా డిమాండ్ చేశారు.

## జనాభా స్వీయగణనపై దృష్టి పెట్టాలి



**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** జనాభా స్వీయ గణనపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కాలేజీయేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ ఆదేశాల మేరకు సెన్సస్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సెన్సస్ సర్వేను స్వయంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ సులభమైనదని, దీని ద్వారా ప్రభుత్వానికి సమగ్ర, ఖచ్చితమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు.

### మజ్జిగ పంపిణీ


వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు కళాశాల దగ్గరలో ఉన్న శ్రీ త్రినాథ స్వామి వారి మండపం వద్ద సుమారు 550 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ జి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయాన్ని గుప్త దాతలు అందించగా, వారి సేవలను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి.నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు, డాక్టర్ వై.వెంకటలక్ష్మి, తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## పెట్రోల్‌బంక్, గ్యాస్ ఏజెన్సీలను పరిశీలించిన వైస్సార్సీపీ బృందం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 28(వార్త):** ఇచ్ఛాపురంలోని రామిరెడ్డి పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్, గస్ సప్లయ్ ఏజెన్సీ, ఈదుపురం రోడ్డు మార్గంలోని ఉప్పాడ సోమేశ్ రెడ్డి నయరా పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్లను వైస్సార్సీపీ బృందం పరిశీలించింది. ఇచ్ఛాపురంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రజలు పెద్ద ఎత్తున ఎండలో బారులు తీరడంతో, వారికి మంచి నీరు, మజ్జిగ సరఫరా చేశారు. సిలిండర్ బుకింగ్‌లో సమస్యలు ఎదుర్కొంటున్నారని, బుక్ చేసినా ఎప్పుడూ సిలిండర్ సరఫరా జరు గుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని గుర్తించారు. నయరా ఫిల్లింగ్‌స్టేషన్ వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనం ఇచ్చాయి. ‘కృతిమ కొరత’ కూటమి నాయకుల దోపిడీకి స్కెచ్ అని, అందుకే కేవలం ఏపీలోనే పెట్రోల్, డీజిల్ సంక్షోభం అని వైసీపీ నేతలు దుయ్యబట్టారు. నాలుగు రోజులుగా ఈ సమస్య మరింత తీవ్రమైందని, అయినా ప్రభుత్వంలో కనీస చలనం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 4,510 బంకులు ఉండగా, 70 శాతం వాటిలో నో స్టాక్ బోర్డు పెట్టారని, పొరుగున ఉన్న ఒడిస్సా, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు. సరఫరాలో సంక్షోభం లేదన్నారు. అయిదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగానే, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారని ప్రచారం జరుగుతుండడంతో, డీలర్లు స్టాక్ ఉంచేస్తున్నారని, ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్పష్టమవుతోందన్నారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, చల్ల దేవరాజు, కారంగి మోహన్‌రావుతేజ, సఫీ, ప్రత్తి అన్వేష్, చల్ల కృష్ణా రెడ్డి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.




## పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కూన రవికుమార్



**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పలాసకు చెందిన నవ వధువు దానేటి సంధ్యను మంగళవారం ఆశీర్వ దించారు. కాశీబుగ్గలో వివాహ శుభకార్యములో పాల్గొన్న ఆయన సూర్యతేజ యాజమాన్యం దానేటి కామేశ్వరరావు, పద్మజ ప్రథమ పుత్రిక సంధ్యకు వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పలాస తెలుగుదేశం నాయకులు బడ్డ నాగరాజు, తమ్మినాన గంగాధర్‌రావు, లొడగల కామేష్, డొక్కరి శంకరరావు, సప్ప నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావుకు సత్కారం



**పలాస, ఏప్రిల్ 28(వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావుకు ఘనంగా మంగళవారం మంగళగిరిలో ఏపీఎస్పీ 6వ బెటాలియన్ రిటైర్డ్ ఏఎస్ఐ సాసుమాన గోపాలరావు దంపతులు సన్మానం చేశారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావుకి తెలుగుదేశం పార్టీలో నూతన పదవి వచ్చిన సందర్భంగా దుశ్శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తమ ఆదర అభిమానాలకు కృతజ్ఞుడినై ఉంటానన్నారు. ఆయన వెంట సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకర్ రావు తదితరులు ఉన్నారు.

## సోంపేటలోనూ ఆయిల్ కొరత

**సోంపేట, ఏప్రిల్ 28(వార్త):** సోంపేటలోను ఆయిల్ కొరత వెంటాడుతోంది. పట్టణం శివారున కవిటి రోడ్డులో గల నయారా పెట్రోల్ బంకులో సోమవారం మధ్యాహ్నం నుంచి పెట్రోల్ లేదంటూ సిబ్బంది చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం వరకు పెట్రోల్ లేక ద్విచక్ర వాహనదారులు కార్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిగతా బంకుల్లో ఆయిల్ లభించినప్పటికీ వాహనదారులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో కొంత రద్దీ ఏర్పడింది. గ్రామాల్లో విక్రయాలకు పెట్రోల్ బంకుల వద్ద అసలు ఇవ్వడం లేదు. దీంతో ప్రస్తుతం గ్రామీణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సుమారు 30 కిలోమీటర్ల దూరంలో గల ఒడిస్సా ప్రాంతానికి వెళ్లి ఆయిల్ ఫుల్ ట్యాంకులు చేస్తున్నారు. కరోనాలో కూడా ఇటువంటి పరిస్థితి లేదంటూ పలువురు వాపోతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉపాధి హామీ వేతనదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన

**-ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచనలు**

**సారవకోట, ఏప్రిల్ 28 (వార్త):** నౌతల గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ మోహన్ కుమార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, పెన్షన్ పంపిణీ, గ్రామ సచివాలయం ద్వారా అందుతున్న సేవలపై వేతనదారులకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న ఐవీఆర్ఎస్ కాల్స్‌కు సరైన సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించి నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది మరియు వేతనదారులు పాల్గొన్నారు.



# మందసలో ట్రాఫికర్

**-దర్జాగా వాహనాలతో రహదారి ఆక్రమణ**

**- ట్రాఫిక్‌కు అంతరాయం**

**- వాహనాలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు**

**-పట్టించుకోని అధికారులు**



**మందస, ఏప్రిల్ 28(వార్త):** మందస మేజరు పంచాయతీకి మేజరు సమస్య పట్టుకుంది.. అభివృద్ధి మందసకు నాయకులు కృషి చేస్తుండగా.. కొంతమంది తీరుతో మందస బస్టాండ్ అస్తవ్యస్థంగా మారుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్రమశిక్షణ లోపిస్తుండగా.. పట్టణానికి గుండెకాయలాంటి మందస బస్టాండ్లో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మందసలోని బస్టాండ్ కూడలి ఆర్అండ్‌బీ, పంచాయతీలకు చెందినది. బస్టాండ్‌కు ఇరువైపులా రహదారులు, భవనాల శాఖకు చెందిన రోడ్డు ఉంది. వాస్తవానికి ఈ రహదారి వాహనాలను తిరగడానికి సరిపోతుంది. కానీ కొంతమంది డ్రైవర్లు, యజమానులు రోడ్లపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. కొద్ది సమయం కాదు.. గంటల కొద్ది ఇదే తంతు. ప్రయాణికుల కోసం వేచి ఉండే వాహనాలు సైతం రోడ్డుపైనే నిలుపుతున్నారు. లగేజీ వాహనాలకు ప్రశ్నించేవారు లేకపోవడంతో గంటల కొద్దీ రోడ్లపైనే నిలిసేస్తున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. కొన్నిసార్లు నిలిపివేసిన వాహనాలు తీస్తే తప్ప ఆ దారిలో వెళ్లడానికి అవకాశం మిగతా వాహనాలకు లేకుండా పోతోంది. రహదారి నిబంధనలను అతిక్రమించి.. నిలిపి వేసిన వాహ నాల దయ కలిగితే తప్ప సక్రమమైన మార్గంలో వెళ్లే వాహనాలకు మోక్షం కలగడంలేదు. కేవలం కొంతమంది డ్రైవర్లు, వాహనాల యజమానుల నిర్లక్ష్యంతోనే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సక్రమైన మార్గంలో వెళ్తున్న వాహనాలకు సమయం వృథా తప్పడంలేదు. కాగా.. ఇటువంటి సంఘ టలతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పట్టణవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి.. మందస బస్టాండ్‌లోని నిర్లక్ష్యపు వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 28(వార్త):** పలాస జీఆర్‌పీ పరిధిలోని పలాస - పూండి రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 30-35 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మృతుడు ఎడమ చేతి చూపుడు వేలికి ఓటు వేసిన ఇంక్ ఉందని, నీలం రంగు ఫుల్ హాండ్స్ షర్టు, కాపీ రంగు గల ప్యాంటు ధరించి ఉన్నాడ న్నారు. మృతదేహాన్ని పలాస గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పలాస రైల్వే స్టేషన్ ఎస్ఐ కోటేశ్వరరావు 9247585743 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## జమచక్రలో .. రక్షిత నీటి పథకం పనుల నిలిపివేత

**- తాగునీటి సమస్యపై గ్రామస్థుల ఆందోళన**



**సారవకోట, ఏప్రిల్ 28 (వార్త):** జమచక్ర గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన రక్షిత నీటి పథకం పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యంగా ప్రకటించిన ఇంటింటా తాగునీటి సరఫరా ఇప్పటికీ అమలు కాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో నీటి ట్యాంక్, బోరింగ్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇంటింటా నీటి సరఫరా ప్రారంభం కాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతూ ఉన్నారని, అధికారులు వెంటనే స్పందించి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. పథకం పనులు పూర్తి అయితే గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దొంగతనాల నివారణకు ప్రజల అప్రమత్తత అవసరం

**- సీఐ శ్రీనివాసరావు**



**సారవకోట, ఏప్రిల్ 28 (వార్త):** నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు సోమవారం రాత్రి సారవకోట పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన దొంగతనాల నివారణపై పలు సూచనలు చేశారు. వేసవి సెలవుల సమయంలో చాలామంది కుటుంబాలు ఊళ్లకు వెళ్లే నేపథ్యంలో, ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే వారు ముందస్తుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారం ఉంటేనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ భద్రత చర్యలను కట్టుదిట్టం చేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల రక్షణకు 'శక్తి' యాప్ వినియోగించాలి

**- నరసన్నపేటలో విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు**




**నరసన్నపేట, ఏప్రిల్ 28(వార్త):** బాలికల స్వీయ రక్షణకు 'శక్తి' యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ సూచించారు. మంగళవారం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏదైనా ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ బాలికలకు రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో వచ్చే అపరిచిత వ్యక్తుల సందేశాలు, లింకులను ఓపెన్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని శక్తి యాప్ వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.

## లక్ష్మీనారాయణ కుటుంబానికి ఎంపీపీ పరామర్శ

**కంచిలి, ఏప్రిల్ 28 (వార్త):** గోకర్ణ పురం వైసిపి నేత ప్రముఖ న్యాయవాది బేసి లక్ష్మీనారాయణ మాతృమూర్తి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. అలాగే సోంపేటలో పైలగున్నయ్య ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కూడా దేవదాసు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యారాడి ఆనంద్ స్థానికులు పాల్గొన్నారు.



## సారవకోటలో వరుస దొంగతనాలు

**- భయాందోళనలో ప్రజలు**



**సారవకోట, ఏప్రిల్ 28 (వార్త):** సారవకోట మండలంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల జరిగిన పలు ఘటనలు స్థానికుల్లో ఆందోళనను పెంచుతున్నాయి. గత నెలలో అవలింగి గ్రామంలో 23 తులాల బంగారం, రూ.1.5 లక్షల నగదు దొంగతనానికి గురైంది. ఇదే తరహాలో ఆదివారం రాత్రి అదే గ్రామంలో మరో ఇంటిలో 2.5 తులాల పుస్తెల తాడు చోరీకి గురైంది. ఇక సోమవారం రాత్రి బైదాలపురం గ్రామానికి చెందిన రాము ఇంట్లో 7 తులాల పుస్తెల తాడు దొంగిలించుకెళ్లారు. ఈ వరుస ఘటనలతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. జిల్లాలో దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ప్రత్యేకంగా రాత్రి పూట నైట్ బీట్ పెంచి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఏబీఎన్ రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలి

**- ధర్మాన కృష్ణదాస్ డిమాండ్**

**నరసన్నపేట, ఏప్రిల్ 28 (వార్త):** ఏబీఎన్ రాధాకృష్ణపై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా నాయకులతో కలిసి ఎస్పీ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 9వ తేదీననే రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరామని, అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మరోసారి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ఈ విషయంపై స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి తిలక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యపై .. పలాసలో జర్నలిస్టుల నిరసన




**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** చిత్తూరు జిల్లా వి.కోట మండల ఏబీఎన్ విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ పలాస నియోజకవర్గంలోని జర్నలిస్ట్‌లు ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరస తెలిపారు. ఆయన హత్యను అత్యంత ఏపీయుడబ్ల్యూజే పలాస ప్రెస్ క్లబ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తీవ్రంగా ఖండించారు. శ్రీగంధం చెట్ల అక్రమ రవాణాపై వార్తలు రాసినందుకే ఈ దారుణానికి ఒడిగట్టారని మండిపడ్డారు. అనంతరం కాశీబుగ్గ డీఎస్పీ టి.భవానీకి వినతిపత్రం అందజేశారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు డి.మహరణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సీహెచ్ జగదీష్ మాట్లాడుతూ శ్రీగంధం చెట్ల అక్రమ రవాణాపై వరుస కథనాలు రాసిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి విలేకరిని హత్య చేయడం దారుణమన్నారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడు లను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు రక్షణ కల్పించా లని కోరారు. మృతుడు జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి 25 లక్షల రూపాయలు పరిహారం, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రతి జర్నలిస్టుకు ఒక గన్‌మెన్ కావాల్సిన పరిస్థితి వస్తుందేమో అనిపిస్తోందని, జగన్మోహన్ రెడ్డిని చంపిన నిందితులపై కఠిన కేసులు నమోదు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యకమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు హరి నారాయణ, అశోక్, నారాయణ, నాని, భుజంగరావు, నేతాజీ, జయంత్, చిట్టి, భీమారావు, రవి, చందన్ రావు, మోహన్, భాస్కరరావు, అంజి, రూప్ సుందర్, సత్యం, కుమార్, మేఘన, కృష్ణ,



## ఇంధన కొరతపై అనుమానాలు



**పోలాకి, ఏప్రిల్ 28 (వార్త):** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత కృత్రిమంగా సృష్టిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. పోలాకి మండలం మబుగాంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని సుమారు 70 శాతం పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు ఏర్పాటు చేయడం వెనుక డీలర్లు, ప్రభుత్వం మధ్య కుమ్మక్కు ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఇంధన కొరత వెనుక కొంతమంది ప్రభుత్వ పెద్దల హస్తం కూడా ఉందని ఆరోపించారు. కొన్ని బంకుల్లో ఇంధన కొరతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## ట్రాక్టర్ దొంగ అరెస్టు

**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** ట్రాక్టర్ దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. మొగిలిపాడు గ్రామానికి చెందిన బుడత జగదీష్ తన ట్రాక్టరును ఎన్‌హెచ్ 16 పక్కన గల తన శ్రీ రాజరాజేశ్వరి కార్ వీల్ అలైన్మెంట్ షాపు ముందు గురువారం రాత్రి పార్కింగ్ చేశారు. శుక్రవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో తన ట్రాక్టర్ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసు వారి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఆ ట్రాక్టర్‌ను తమిళనాడుకు చెందిన అన్నతురాయి దొంగిలించినట్లు గుర్తించి, ఆయనను సోమవారం అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించారు.



## పలాసలో పెట్రోల్‌కు కొరత లేదు

### - టీడీపీ నాయకులు



**పలాస, ఏప్రిల్ 28 (వార్త):** పలాస నియోజకవర్గంలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ విచ్చలవిడిగా దొరుకుతుందని, దయచేసి ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు కూడా గమనించాలని, కేవలం పలాస నియోజకవర్గంలో మాజీ మంత్రి అప్పలరాజు తన రాజకీయాల్లో తన ఉనికిని కాపాడడానికి కోసం మాత్రమే డీజిల్, పెట్రోల్ బంకుల్లో దొరకట్లేదని తప్పుడు సమాచారాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారని బ్రాహ్మణతర్ల టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం పలాస లోని టీడీపీ నాయకులు పెట్రోల్ బంకులను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు ఉనికిని కాపాడుకోవ డానికి మాత్రమే నిరసన కార్యక్రమం నిర్వహించారన్నారు. గరుడకండిలో ఉన్న పెట్రోల్ బంకుల్లో స్టాఫ్‌ని తాము అడగగా, పెట్రోలు, డీజిల్ కొరత లేదని తెలిపారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వడ్డీ యాదగిరి, పలాస యూనిట్ కో కన్వీనర్ ఆళ్ల కృష్ణారావు, అమలుకుడియా నీటి సంఘం ఉపాధ్యక్షులు చల్ల విశ్వనాథం, పండా, శాసనం ఎస్ఎంపీ స్కూల్ చైర్మన్ ఆళ్ల సోమేశ్వరరావు, పలాస మండలం విశ్వ బ్రాహ్మ ఖుల శిల్పి సంఘ ఉపాధ్యక్షులు శాసనపూరి వెంకటరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లాడ కృష్ణారావు, జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ మెంబర్ కోరాడ జోగారావు తదితరులు పాల్గొన్నారు.


## మౌలిక సదుపాయాలకు మొదటి ప్రాధాన్యత



**కంచిలి, ఏప్రిల్ 28 (వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని కంచిలి మండలం టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు పేర్కొన్నారు. ఈ మండలం కొన్నాయిపుట్టుగ గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ కూటమి ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలకు పెద్ద పేట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను రామారావు చిన్నబాబు భైరవ కిషోర్ జగబంధు తదితరులు పాల్గొన్నారు.

## రేగుపాడులో పాలపోలమ్మ తల్లి ఘటాల పండుగ

### - దర్శించుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి




**పోలాకి, ఏప్రిల్ 28(వార్త):** రేగుపాడులో ప్రేమ దేవత పాలపోలమ్మ తల్లి ఘటాల పండుగలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించిన ఎమ్మెల్యే, గ్రామస్థుల ఆహ్వానం మేరకు పలు ఇళ్లను సందర్శించి ఆతిథ్యాన్ని స్వీకరించారు. పండుగ వాతావరణంలో గ్రామం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ ఎంపీపీ తమ్మినేని భూషణరావు, క్లస్టర్ ఇంచార్జ్ సూరపు నారాయణదాసు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె యర్రయ్య, మాజీ సర్పంచ్ పూజారి సోమేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొని, అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు తరలివచ్చారు.



# కిమ్స్ వైద్యుల అద్భుత వైద్యం..!

### -తెగిపడిన వేళ్లకు పునర్జన్మ.. - బాధితుడికి ఉపశమనం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 28 (వార్త):** శ్రీకాకుళంలోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు మరో అరుదైన వైద్య విజయాన్ని సొంతం చేసుకున్నారు. ప్రమా దవశాత్తూ వేళ్లు తెగిపోయి ఆవేదనతో ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి అత్యాధునిక రీకన్‌స్ట్రక్టివ్ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చి భరోసా కల్పించారు. గార మండలానికి చెందిన ఓ వ్యక్తి మాంసం కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ కత్తి తగిలి చూపుడు వేలు, బొటన వేలు పూర్తిగా వేరుపడ్డాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న బాది తుడిని కుటుంబ సభ్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆయనతో పాటు ఆ వేళ్ళని కూడా తీసు కొచ్చారు. ఈ పరిస్థితిని సమీక్షించిన ప్లాస్టిక్ సర్జరీ విభాగం నిపుణులు డాక్టర్ బుల్లి బోయిడి నేతృత్వంలోని బృందం తక్షణమే రంగంలోకి దిగింది. అత్యంత క్లిష్టమైన ఈ పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయ వంతంగా నిర్వహించి, తెగిపోయిన వేళ్లను తిరిగి అతికించారు. ప్రస్తు తం బాధితుడి చేతి పనితీరు మెరుగుపడిందని, రోగి కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా కిమ్స్ డైరెక్టర్ గూడెన సోమేశ్వ రరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి చేరుకుంటే ఇలాంటి 'లింబ్ సేవింగ్' సర్జరీల ద్వారా తెగి పోయిన అవయవాలను తిరిగి కాపాడుకోవచ్చని సూచించారు. గతంలో ఇలాంటి చికిత్సల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు శ్రీకాకుళం కిమ్స్‌లోనే అధునాతన సాంకేతికత, నిపుణులైన వైద్య బృందం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వైద్య బృందాన్ని ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.

Department of Plastic Surgery
KIMS HOSPITALS™
SRIKAKULAM

A patient with severe hand injury and finger amputation was successfully treated through advanced reconstructive surgery by the Department of Plastic Surgery at KIMS Hospitals,Srikakulam

Under the expert care of Dr. Bulli Boydi, complex surgical intervention helped restore hand structure, improve functionality, and support recovery.



Before → After

Our Plastic Surgery team specializes in managing traumatic injuries, reconstructive procedures, and limb-saving surgeries with precision and compassionate care.

Consult Our Expert Plastic Surgeon Book an Appointment



Dr. Bulli Boyidi
MBBS, DNB (General Surgery)
MCH Plastic Surgery
Plastic, Reconstructive, Aesthetic Surgeon
Sr. Consultant Plastic surgeon, GEMS



### సీఎం పర్యటనకు ..

## సన్నాహాలు వేగవంతం

### - జలుమూరులో జడ్పీ సీఈవో సమీక్ష

**జలుమూరు, ఏప్రిల్ 28 (వార్త):** జలుమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో లబ్ధిదారుల వివరాలను హౌస్ టు హౌస్ సర్వే ద్వారా ఖచ్చితంగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అక్కురాడ గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు వేగవంతం

### - పీడీ అధ్వర్యంలో సమీక్షా సమావేశం

**జలుమూరు, ఏప్రిల్ 28 (వార్త):** జలుమూరు మండలంలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధిని మరింత వేగవం తం చేయడానికి సమన్వయ చర్యలు కీలకమని పీడీ (గ్రాణ) పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఎస్‌డబ్ల్యూఎస్‌జీ (రాబో+), వ్యవసాయ శాఖ మరియు అనుబంధ విభాగాల సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల ఆదాయ వృద్ధి, పంట ఉత్పాదకత పెంపు, పశుసంవర్ధక, మత్స్య, తోటల పెంపకం వంటి రంగాల మధ్య సమన్వయం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అన్ని శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే లక్ష్యాలు సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. మండలంలోని రైతులకు సమగ్ర సేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక మార్గదర్శకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుబంధ శాఖల సిబ్బంది తమ తమ విభాగాల కార్యక్రమాలను వివరించగా, వాటిని ఏకీకృతం చేసి అమలు చేసే విధానాలపై చర్చించారు. ముఖ్యంగా, సహకార వ్యవస్థ బలోపేతం, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహణపై దృష్టి సారించారు. సమావేశం చివరలో పీడీ గ్రామీణ అభివృద్ధి కోసం అన్ని శాఖలు ఒకే దిశగా కృషి చేయాలని, రైతులకు లాభదాయక ఫలితాలు అందేలా కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ చిన్నమ్మడు తో పాటు మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డప్పు కొట్టించండ్రా..!

- -కనుమరుగవుతున్న డప్పు కళ
- -డీజేలు వచ్చి డప్పు పోయే
- -డప్పు మోగితే పండుగ మొదలైన రోజులేవీ?
- - జానపద కళ అంతరించిపోతుండడంపై ఆవేదన



**జలుమూరు, ఏప్రిల్ 28(వార్త):**

ఒకప్పుడు డప్పు శబ్దం వినిపిస్తే ఊరంతా ఒక్కచోట చేరేది. ఆ శబ్దంలో ఆనందం, ఆ తాళంలో సంస్కృతి నిండిపోయి ఉండేది. జాతరలు, బోనాలు, ఊరేగింపులు, పెళ్లిళ్లు, పండుగలు.. ఏ వేడుకైనా డప్పు లేకుండా పూర్తయ్యేది కాదు. ఎండైనా, వానైనా, రాత్రింబవళ్లు తిరుగుతూ డప్పు కళాకారులు ప్రజల ఆనందానికి శ్రమించారు. చేతులు నొప్పితో ఉన్నా, కడుపు ఖాళీగా ఉన్నా ముఖంలో నవ్వుతో తమ కళను ప్రదర్శించారు. గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ కళాకారులు ఒకప్పుడు ప్రతి ఊరికి గౌరవ అతిథులుగా నిలిచారు. అయితే కాలానుగుణంగా పరిస్థితులు మారాయి. ప్రస్తుతం ప్రతి వేడుకలో డీజే సౌండ్లు, ఆధునిక పరికరాలు ప్రాముఖ్యత పొందుతున్నాయి. ఒక బటన్ నొక్కితే పాట వినిపించే ఈ కాలంలో, శ్రమతో కూడిన డప్పు కళకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. డీజే కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టే వారు, డప్పు కళాకారులకు సరైన పారితోషికం ఇవ్వడంలో వెనుకాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డప్పు కేవలం వాయిద్యం మాత్రమే కాదు, అది పల్లె సంస్కృతి, జాతి గౌరవం, సంప్రదాయానికి ప్రతీక. డప్పు మోగితే రక్తం ఉరకలెత్తే ఉత్సాహం కలుగుతుందని కళాకారులు చెబుతున్నారు. ఆధునికత అవసరమైనా, మన మూలాలను మర్చిపోవద్దని వారు సూచిస్తున్నారు. ప్రతి వేడుకలో కనీసం ఒక్కసారైనా డప్పు కళాకారులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. వారి కళ బతికితేనే మన సంస్కృతి నిలుస్తుందని, వారి కుటుంబాల్లో వెలుగు నిండుతుందని పేర్కొంటున్నారు. డప్పు శబ్దం ఆగిపోకుండా, మన సంప్రదాయం నిలవాలని, జానపద కళాకారులు గెలవా లని వారు ఆకాంక్షిస్తున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546